# రాబందు

## రాణీమోహన్

"ఓ లప్పో! ఎంకమ్మప్పో! కొంప మునిగిపోనాదే!"

అరుస్తూ కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చేడు అప్పలసూరి.

అప్పలసూరి వేపు ఆశ్చర్యంగా చూసేరు కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణీకులు. వాళ్ళంతా వ్యాపారస్తులు-

అప్పలసూరి నెత్తిమీదున్న గంపను సీటుకింద పెట్టి బరువుగా వూపిరి తీసుకున్నాడు. మూల సీట్లో కూర్చున్నాడు.

"ఏట్రా!.....ఎదవా.....ఎవుడి కొంప మునిగిపోనాద్రా!ఎదవగాబరా నువ్వూనూ!.. జారిపోయిన కొప్పు ముడిని చుట్టుకుంటూ అప్పలసూరిని ప్రశ్నించింది నూకాలు.

అప్పలసూరి అయాసపడ్తూ ఆమె వేపు చూసేడు-



"వోలే.....నూకాలప్పా! మన కొంప కాదే! అడి కొంపే అయుంటుంది..... ఏరా!" చుట్ట అంటించుకుంటూ అంది వెంకమ్మ.

"నాదికాదే యప్పా!" నెమ్మదిగా అన్నాడు అప్పలసూరి.

"మరెవర్దేటి....సెప్పు!" అరిచింది వెంకమ్మ.

"మనందర్దీనూ...."నవ్వుతూ అన్నాడు.

"ఆ...." అంతా ఒక్కసారి అన్నారు.

"ఈయాల పాసింజరు బండిలో టి.సి. కుమార్ గోడున్నాడే యప్పా!" నవ్వుతూ అన్నాడు అప్పలసూరి.

"వుణ్ణీరా... ఆడు మనలేటి సేత్తాడు. మనమంతా పేసులుకొన్నాం." ధీమాగా అంది నూకాలు.

ఆమె మాటకు- వ్యాపారస్తులంతా ఔనన్నట్టుగా (పడగవిప్పిన) పాముల్లా తలలూపేరు.

"ఒరే! అప్పిగా..... కుమార్‌గోడు రోజూనాగలేడు. యమా పోరుసుగా అగ్గితొక్కిన కోతినాగున్నాడు. అవతల పెట్టెలో పాసింజీరులమీద గంతులేత్తూ టిక్కెట్లు సెకింగ్ సేత్తూ.... లేనోళ్ళందరి కాడా తెగ డబ్బులు గుంజేసుకుంతున్నాడ్రోయ్" అన్నాడు అప్పలసూరి.

అప్పలసూరి అన్న మాటలు విని అంతా ఆశ్చర్యపోయేరు-

అనకాపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం మీద వున్న వాల్తేరు వెళ్ళే పాసింజర్.... నత్తలాగ ముందుకు కదిలింది. కంపార్ట్‌మెంట్‌లో వున్న వాళ్ళు ఎవరి మానాన్న వాళ్ళు మాట్లాడుకుంటున్నారు.

సర్వసాధారణంగా ఆ బండిలో ప్రయాణించేవాళ్ళంతా... కార్మికులు... కూరగాయలు.... బెల్లం.... చిల్లరసరుకులు అమ్ముకునేవాళ్ళూ.... రైతులూనూ..... వ్యాపారస్తులంతా రోజూ అనకాపల్లిలో సరుకులు కొనుక్కుని..... రైళ్ళలో వెళ్తూ వుంటారు.

వాళ్ళందరూ నెలసరి ప్యాసులు కొనుక్కుని ప్రయాణం చేస్తూ వుంటారు. మరి కొందరు టీ.సీ.కి "రెండు... మూడు"



రూపాయలు చదివించుకుని ప్రయాణిస్తూ వుంటారు. పాసింజర్‌లో డ్యూటీ చేసే టి.సి.లకు మాత్రం ఆ వ్యాపారస్తుల నుంచి దండిగా సొమ్ము లొస్తాయ్. వ్యాపారస్తుల్లో కొందరు గ్రూపులుగా వుంటారు. ఆ గ్రూపులకు ఒక నాయకుడుంటాడు, అతడు తోటివాళ్ళ నుంచి సొమ్ములు వసూళ్లు చేస్తాడు. ట్రైన్ డ్రైవర్‌కు-గార్డ్‌కు.... టీ.సి.లకు యీ నాయకులు మంచి నేస్తాలు. ఇది ఒక అనవాయితీగా సాగుతూంది.

అందుకనే వ్యాపారస్తులకు కావలిసిన చోటుల్లో ట్రైనును అపుతావుంటారు... అలా ఆగిన ట్రైన్‌లోంచి టిక్కెట్లు కొనని చిల్లర వ్యాపారస్తులకు ప్రయాణీకులకు లాభం!

కూరగాయలు అమ్మేవాళ్ళ బృందంలో ఒక గ్రూప్‌కు నాయకుడు అప్పలసూరి. అతగాడు ఆ పదవిని గత పదేళ్ళనుంచి నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో ఆర్జించిన లాభం బ్యాంకులో వేసేడు. చిల్లర వ్యాపారస్తులకు స్వల్ప వడ్డీల మీద అప్పులు యిస్తూ వుంటాడు. అప్పలసూరికి పెళ్ళి అవలేదు. అతడికి పెళ్ళాంకన్నా- డబ్బు అంటేనే ప్రేమ ఎక్కువ!

పాసింజర్... ఎడ్లబండిలా నడుస్తోంది-

బయటనుంచి శీతగాలి లోపలకు

వస్తోంది. వెలుతురు కరిగిపోయి చీకటి ప్రవేశించింది. కంపార్ట్‌మెంట్‌లో దీపాలు వెలిగేయ్....

అప్పుడే, కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించేడు టి.సి. కుమార్. కంపార్ట్‌మెంట్‌లో వున్న వ్యాపారస్తులంతా కుమార్‌ని చూసి తుళ్ళిపడ్డారు! భూతాన్ని చూసినట్టు బెదిరేరు.

"దండాలు కుమార్ బాబూ" అంది నూకాలు. కుమార్ తలవూపి అవతల బెంచీ మీద వున్న ప్రయాణీకుల వద్దకు వెళ్లాడు. కొందరు తమ వద్ద వున్న టిక్కెట్లు చూపించేరు. మరికొందరు జేబుల్లోంచి రెండేసి రూపాయలు తీసి యిచ్చేరు.

"వూ...... మిమ్మల్ని పోలీసులకు అప్పచెప్పాలి. దాంతో మీరోగం కుదురుతుంది." అన్నాడు కుమార్.

"వరే! అప్పారావు నీ పాస్ ఏదీ?" అప్పారావు ప్యాస్ చూపించేడు.

"వూ.... ఆ మూట నీదేనా?" కాలితో తోస్తూ ప్రశ్నించేడు కుమార్.

"నాదే బాబూ!"

"అందులో ఏముందిరా?"

"కూరలు బాబూ...."

"మూట విప్పు...?"

అప్పారావు మౌనంగా సీట్‌లోంచి లేచి మూట విప్పేడు. అందులో ఆకుకూరల మధ్య పెద్ద బెల్లం దిమ్మ వుంది. అది చూసి కుమార్ ఉగ్రుడయ్యేడు.

"ఏరా! నాకే మస్కా వేస్తావా? తియ్..... పదిరూపాయలు....ఫైన్ కట్టు...."

## రాబందు

"బాబూ.... కుమార్.... తప్పై నాది.... నన్నీపాలికి వొగ్గేయ్....." భయంగా అన్నాడు అప్పారావు.

"నిన్ను వదలన్రా.... పది రూపాయలు కట్టు..... లేదా, వాల్తేరులో రైల్వే పోలీసులకు అప్పగిస్తా. వాళ్ళు నిన్ను వారం రోజులు బొక్కలో వుంచుతారు" అన్నాడు కుమార్.

అప్పారావు అప్పలసూరి వేపు దీనంగా మొహం పెట్టేడు. అప్పలసూరి తన సీట్లోంచి లేచి కుమార్ దగ్గరకు వచ్చేడు.

"కుమార్ బాబూ" నెమ్మదిగా పిల్చేడు అప్పలసూరి.

"ఏరా....."

"అణ్ణీ.... యీపాలికొగ్గేయండి బాబూ...... ఆడి యాపారం బాగా డల్లైపోనాది" అన్నాడు అప్పలసూరి.

"ఏటి? అణ్ణీ వొగ్గేయాలా.... యీల్లేదు.... ఆడు ఫైన్ కట్టాల్సిందే.....!" వెటకారంగా అన్నాడు కుమార్.

విధిలేనట్టుగా అప్పారావు కాకీనిక్కరులోంచి నలిగిపోయిన పదిరూపాయల నోటు బయటకు తీసి కుమార్‌కు అందించేడు. కుమార్ ఆ నోటును నల్లబేగ్‌లో వేసుకుని అప్పలసూరి వేపు చూసేడు.

"వూ.... మీరేటి పట్టుకెల్తున్నారు... చూపండి?"

"ఏటి....కుమార్ బాబూ.... అట్టా గంతున్నావు...కూరలు....బాబూ..." అంది నూకాలు.

నూకాలన్న మాటలకు కుమార్ కోపంతో వూగిపోయేడు. బెర్త్‌మీదున్న మూట్లను తడిమిచూసేడు.

"ఈ మూటలన్నీ నీవేనా నూకాలూ!"

"ఏటీ? ఆ మూటలన్నీ నావా! కావు బాబూ.... యాళ్ళందరివీ!" అంది నూకాలు.

"మీ మూటలు అన్నీ యీ వేళ ఎక్కువగా వున్నాయ్... తలోవొక్కరూ ఆరేసి కేజీలు పట్టుకెళ్ళాలి!" అర్చేడు.

"అయిసయం...మాకెరికే బాబూ!... అంత బరువు లేవీ నేవు...." అంది వెంకమ్మ.

"నూ వొల్లకోవే ఎంకమ్మప్పా.... నాను సెప్తా!" అన్నాడు అప్పలసూరి.

"బాబూ.... యీ మద్దినా మా యాపారాలు సానా ఈకైపోనాయి. నా బాలునేవు"( మామూళ్లు మాత్రం ఎక్కువైపోనాయ్)అన్నాడు అప్పలసూరి.

"అయితే నన్నేం సెయ్యమంటావురా! మీకందరికీ అప్పులు యిమ్మంటావా?" వెటకారంగా అన్నాడు కుమార్.

"అంతపని తమరు సెయ్యక్కర్లేదు... బాబూ... యీపాలికి మమ్మల్ని వొగ్గేయండి సాలు" అని లాల్చీ జేబులోంచి రెండు పదిరూపాయలనోట్లు తీసి కుమార్‌కు యిచ్చేడు అప్పలసూరి.

"నూకాలూ!"

"బాబూ..."

"నీ వంతు డబ్బు....యియ్యి....."

నూకాలు మౌనం వహించింది.

"ఏమే....యినపళ్ళేదా- చెవుల్లో చెట్లు మొలిచేయా?" అర్చేడు కుమార్.


"కుమార్ బాబూ.... మా అందరి వంతూ సూరిగోడు యిచ్చేడు కదా! మల్లా నానెందుకు ఇయ్యాల...." అంది నూకాలు.

"అది వాడొంతే.... నీ వంతు పది... వూ....యియ్యి" అర్చేడు కుమార్.

"అన్నాయం.....బాబూ.... మాకాడ డబ్బుల్లేవు" అంది వెంకమ్మ.

"పోనీ... ఏం చేస్తాం.... మిమ్మల్నందరినీ వాల్తేరు ఆర్పీఎఫ్ వాళ్ళకి లగేజీల్తో అప్పచెప్తాలే.... అప్పుడు మీ అందరికిలం వొదుల్తుంది. వంట్లో వున్న కొవ్వూ కరుగుతుంది." కోపంగా ఆమెవేపు చూస్తూ ముందుకు కదిలేడు.

టిక్కెట్లున్న వాళ్ళు తక్కువై....



లేని వాళ్ళు ఎక్కువగా వున్నారా కంపార్ట్ మెంట్ లో... వాళ్ళ వద్ద నుంచి డబ్బులు వసూలు చేసేడు కుమార్.

"వరే నూరిగా...." పిల్చింది నూకాలు.

ఆమె వేపు చూసేడు అప్పలసూరి.

"ఏటే నూకాలు.... ఏటి సేత్తావ్?"

"అదే అరదం కానేదురా.... మాకాడ అంతసొమ్ము నేదు... మాసరుకులు బజార్న సెల్లేక....నీకు యిత్తాం.... మా అంద రొంతు నువ్వే యిచ్చీరా...." బతిమాల్తు న్నట్టుగా అంది నూకాలు.

"నాకాడ అంత సొమ్ము నేదే.... నా బిగినెస్సూ మీ నాగే వుంది" తలగో క్కుంటూ అన్నాడు అప్పలసూరి.

"వరె.... అట్లాగ అనకరా... నీ మనసు ఎన్న... ఎలాగో నాగనువ్వే ఈ గండం నుంచి మిమ్మలిని కాపాడాలి..." అంది వెంకమ్మ.

"ఎంకమ్మప్పా... నీ మాటంతే నాకు మాసెడ్డ గురి... మీ అందరొంతు సొమ్ము నలభై అవుతుంది....." నసిగేడు అప్ప లసూరి.

అంతా ఆలోచనలో పడ్డారు....

"వాలే..ఎంకమ్మప్పా....ఏతంతావ్.... నాబంనేదే.... అకుమార్ గోడు పరమడా కూగోడు... మీరు అడికి నంచం యివ్వనే దన్న కసితో మీ సరుకులిని మిమ్మల్ని అర్పి ఎవోల్లకి వొప్పగిత్తాడు. అల్లు యీడిబా బులు. మీరు బయటికి వచ్చేసరికి వందరూ పాయలు కరుసు అవుతాయి... సరుకూ పోతాది. అంతే!" ఆగేడు అప్పలసూరి.

"అయితే ఏటి సేద్దాంరా... నువ్వే సెప్పు....." అంది వెంకమ్మ అసహ్యంగా.

"ఏటుంది... ఆ ఎదవ మొగాన్న నలభై పారేత్తే పీడ వదిలిపోతాది" సలహా యిచ్చేడు అప్పలసూరి.

"ఆ సొమ్ము మా కాడనేవురా... నువ్వే యిచ్చేయిరా..." అంది వెంకమ్మ.

వెంకమ్మ వేపు చూసేడు అప్పల సూరి. తలవూపేడు.

"వోవల్ రైట్.....యిత్తానప్పా.... కానీ ఆ నలభైకి వడ్డీ అయిదురూపాయలు అవుద్ది... .ఏతంతారు....?" వాళ్ళవేపు చూస్తూ అన్నాడు అప్పలసూరి.

అంతా కొద్ది క్షణాలు తర్కించుకు న్నారు. తలలు వూపేరు.

"ఏటి సేత్తాం....మాకా బేరాలు నేవు. నాబాల్లేవు..... మద్దినున్న ఎద వలకు మామూళ్లు మాత్రం యియ్యాల. వరే.... అప్పలసూరి ఆ ఎదవ మొగాన్ని నలభై పారేయ్. రేపుదయం నీకు నలభై అయిదు యిత్తాం..." అంది నూకాలు.

"అట్టాగేనే నూకాలు" అంటూ వేగంగా ముందుకు కదిలేడు అప్పలసూరి.

టి.సి. కుమార్ కంపార్ట్ మెంట్ డోర్ వద్ద నిల్చుని వున్నాడు. ఏదో ఆలో చిస్తున్నాడు.

"బాబూ....." పిల్చేడు అప్పల సూరి.

కుమార్ ఆలోచనలోంచి తేరుకు న్నాడు. అప్పలసూరి వేపు తిరిగేడు.

"ఏరా....?"

"అల్లు యీ పాలికి యింతే యిచ్చేరు బాబూ.... అసలే బిగినెస్సు డల్లై పోనాది." అంటూ కుమార్ కి యిరవైరూపాయల




నోటు అందించేడు అప్పలసూరి.

నవ్వుతూ ఇరవైరూపాయలనోటు అందు కున్నాడు కుమార్.

"రశీదులిస్తాలే అగుపడు" అన్నాడు.

* * * * * *

"కుమార్! యిక తాగకు.... యివాళ నీ కోటా ఎక్కువైపోయింది" ప్రేమగా అంది మేనక....

తలపైకెత్తి ఆమె వేపు చూసేడు కుమార్. నవ్వుతూ అతడివేపు చూసింది మేనక.

-మేనక.

పేరుకు తగ్గ మనిషి!

ఆమె అంటే కుమార్ కి అమితమైన ప్రేమ. వాల్తేరు వచ్చినప్పుడు అతడు ఆమె యింట్లోనే వుంటాడు. రాత్రుళ్ళు కుమార్ కు మందుకు, పొందుకు లోటు వుండదు. ఆమె అడిగినంత సొమ్ము లేదనుకుండా యిస్తాడు. అందుకు ఆమె ఆనందంగా తగిన 'ప్రతిఫలం' యిస్తుంది.

కుమార్ గ్లాసులో వున్న విస్కీని ఖాళీ చేసేడు. మత్తుగా కళ్లు మూసుకున్నాడు. వెంటనే తలవిదిల్చేడు.

కళ్ళ ముందు అతని భార్య కాంతం రూపం ప్రత్యక్షమైంది.

"ఏమండీ..."నిమ్మళంగా పిల్చింది కాంతం.

"వూ...." వెనక్కి తిరిగేడు.

అతని వేపు దీనంగా చూసింది కాంతం.

"ఏం....?" కోటు సద్దుకుంటూ ప్రశ్నించేడు కుమార్.

"మీరు మళ్ళీ లైన్ మీదకెళ్తు న్నారా?"

"ఆ...."

"ఎప్పుడొస్తారు?" భయంగా అడిగింది కాంతం.

"ఎల్లుండి ట్రిఅప్ లో వస్తాను.... ఏమైనా వస్తువులు తేవాలా?"

"అమ్మాయికి నాల్గురోజుల్నుంచి సాయం కాలం వేళ జ్వరం వస్తోందండీ.... మీరు ఎప్పుడూ డ్యూటీ మీదే వుంటారు. అందు కని ఈసారి శెలవుపెట్టి అమ్మాయిని డాక్ట ర్ కి చూపించండి...." అంది కాంతం.

ఆమె మాటలకు కుమార్ ఆలోచిం చేడు. రెండడుగులువేసి ఆమెను చేరేడు.

"కాంతం.... నాకూ అమ్మాయి మీద ప్రేమ వుంది. డాక్టర్ కి చూపించా లనే ఉద్దేశం వుంది.. .. కానీ శెలవు పెట్టాలంటే రిలీవర్ లేడు.... అందుకని నువ్వే అమ్మాయిని తీసుకెళ్ళి డాక్టర్ కి చూపించు. ప్లీజ్!" అన్నాడు కుమార్.

"బాగుంది మీ సలహా.... మందు లకీ... డాక్టర్ ఫీజుకీ.... సొమ్ము లేదు. మీరిచ్చేజీతం యింటి ఖర్చులకే సరిపో తుంది. అందరు టి.సి.ల్లా... పైరాబడి అనేది, మీకు లేదు... ఏమైనా అంటే.... నీతి.... నిజాయితీ అని లెక్చర్లు యిస్తారు. చేతిలో సొమ్ము లేందే.... అమ్మాయి జ్వరం ఎలా నయం అవుతుందండీ!" అంది కాంతం. హృదయంలోంచి తన్నుకొచ్చే బాధ వల్ల ఆమె కళ్ళ నుంచి కన్నీరు కారసాగింది.

కుమార్ ఆమె కన్నీళ్ళను రుమాల్తో తుడిచి రుమాలును జేబులో వుంచుకుని మరో జేబులోంచి వొక పదిరూపాయల నోటు తీసి ఆమెకందించి నల్లబ్యేగ్ తో ముందుకు కదిలేడు మౌనంగా.

కాంతం వేగంగా అతన్ని చేరింది. అతడి పాదాలమీద పడిపోయి భోరున విలపించింది.

"కాంతం..ఏడుస్తే..అమ్మాయ్ జ్వరం తగ్గిపోదు. డాక్టర్‌కి చూపించు. నేను ఎల్లుండి వచ్చి పెద్ద డాక్టర్‌కి చూపిస్తా...లే!" కసురుతూ అన్నాడు కుమార్. ఆమె లేవలేదు. కుమార్ ఆమెను పక్కకు తోసి ఆమె మీద మరో పది రూపాయల నోటు విదిల్చేసి ముందుకు కదిలేడు.

వేగంగా వెళ్తున్న కుమార్‌ను వారించబోయింది కాంతం.

అటుకూతురి ఆరోగ్యం-యిటు భర్త డబ్బు యిచ్చి వదిలించుకోవాలని చూసే నిర్లక్ష్య ధోరణికి- ఆ యిల్లాలు కంటి నుండి ధారలుగా కన్నీరు కారింది-

కుమార్ ఒక్కసారి తల విదిల్చేడు.

దృశ్యం ఫేడౌట్ అయింది-

ఎదురుగా మేనక వుంది.

గ్లాసులో మళ్లీ విస్కీ పోసుకుని అయిస్ నీళ్లు పోసుకుని గటగటా విస్కీని తాగేసేడు. మేనక అతడి చెయ్యి గట్టిగా పట్టుకుంది.

"కుమార్ యిక చాలు- లే- భోంచేద్దూగాని.. నీకోసం వేడి అన్నం, చేపల పులుసు..కోడిమాంసం కూర వండాను.." గోముగా అంది మేనక. కుమార్ కళ్లు మూతలు పడ్డాయి. మంచం మీద పరిగిపోయాడు. మేనక మంచం పక్కనున్న స్టూల్‌పై వున్న నల్ల బేగ్ అందుకుంది. బేగ్ తెరిచింది. లోపల వున్న నోట్లను చూసి ఆశ్చర్యపోయింది. మంచం మీద స్పృహ లేకుండా పడి ఉన్న కుమార్‌ని ఓరగా చూసి చూపును నోట్లవైపు మళ్లించింది. ఆమె వేగంగా బేగ్‌లో ఉన్న సొమ్మును లెక్క పెట్టింది. తృప్తిగా ఒక్కసారి ఊపిరి తీసుకొని వదిలింది.

"కుమార్ ఈ రోజు 'నీ కష్టార్జితం' ఆరువందలన్నమాట భేష్!" అనుకుంది మేనక-

ఆ సమయంలోనే-

కుమార్ యింట్లో.... పసిపిల్లకు ఒంటిమీద ధాన్యపు గింజవేస్తే పేలిపోతున్నట్టుగా వుంది- కుమార్ భార్య ఆ పిల్ల వంటి మీద తడిగుడ్డతో తుడుస్తోంది. ఆ గుడ్డ వేడెక్కగానే... మళ్ళీ తడిపి తుడుస్తోంది.

పిల్ల బరువుగా కళ్లు తెరచింది- తెల్ల గుడ్డు బయటపడింది.

"అమ్మా...." నీరసంగా అంది.

"తల్లీ...." పిచ్చితల్లి గొంతు వణికింది. పసిపిల్ల ఆ మాత్రం అనడం ఆమెకు వరంలాగే వుంది.

"......నాన్న....గారే.....రమ్మా..?"

"వస్తారమ్మా" నిమ్మళంగా అంది కాంతం.

పిచ్చికూతురికి. ఆ మాట నమ్మకం లేనట్టుంది.

"నిజంగా!"

"నిజంగా నమ్మా.... అమ్మా.... నువ్వేమేనా తాగుతావా... రెండురోజులైంది. నువ్వు ఎంగిలిపడి...." ప్రేమగా అంది పిచ్చితల్లి.

"వద్దమ్మా.... నాన్నగారిని చూడాలమ్మా!"

పిచ్చితల్లి నెమ్మదిగా లేచి వెళ్ళి బార్లీ గంజి తెచ్చింది. పసిపిల్లను నెమ్మదిగా లేపి కూర్చోబెట్టి గంజితాగించబోయింది.

పసిపిల్లకు ఒక్కసారి పొలమారింది గిజ...గిజలాడింది-

అదేమీ తెలియని కుమార్ యింకా ప్రియురాలు మేనక వెచ్చని కౌగిట్లో 'తను వెతుక్కుంటున్న స్వర్గం కోసం' సతమతమౌతున్నాడు. ●

## సరిక్రొత్త సీరియల్ పైవారం వివరాలు

## రాజముద్రిక

చాళుక్య భూపతుల రాజముద్రిక వరాహలాంఛనం. కడు సొంపై, ఉభయ తలాలు అంచులు తీర్చబడి, కింది భాగం నాలుగు రేకుల పువ్వులా వుండి, కర్ణిక ఉండే చోట వలయంతో తాపడం చేసి వుంది. ఉపరితలం మధ్యలో 'త్రిభువనాంకుశం' అనే బిరుదాక్షరాలున్నాయి. శాసనభాష అయిన ప్రాకృత లిపి, వరాహ లాంఛనంతో పాటు చంద్రుడు, అంకుశం, శంఖం, ఛత్ర చామరం, దీపం శెమ్మెలు ముద్రిక మీద చోటు చేసుకున్నాయి. అడుగు భాగాన తామరపువ్వు వుంది. అతి ముఖ్యులు, పంచ ప్రధానులకు మాత్రమే ఈ ముద్రిక లభించేది. కోటలో ఎక్కడికైనా యధేచ్ఛా ప్రవేశానికి ఉపకరించేది ఈ ముద్రికే !



చాళుక్య రాజముద్రిక
(వరాహ లాంఛనం)

ఈ రాజముద్రికకి, మీరు త్వరలో చదువబోయే సీరియల్ కి చాలా దగ్గరి సంబంధం వుంది.
ఏమా సీరియల్ ?
వచ్చేవారం చూడండి !